SRI TIRUMALA TIRUPATI GAUDIYA CHARITABLE TRUST
(By the blessings of His Divine Grace Śrīla Bhaktivedānta Nārāyaṇa Gosvāmī Mahārāja and under the guidance of His Holiness Śrī Śrīmad Bhaktivedānta Daṇḍī Mahārāja)
8-2-217, Ashok Nagar, Tirupati, Tirupati (Urban), Andhra Pradesh, Pin: 517501.
Mobile: 9021625228, 9290452747, 90005 55556, 94409 84438, 99596 74401

శ్రీకృష్ణచైతన్య ప్రభు నిత్యానన్ద, శ్రీఅద్వైత గదాధర, శ్రీవాసాది గౌర-భక్త-వృన్ద|
హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే| హరే రామ హరే రామ రామ రామ హరే హరే॥

నివేదనము

(శ్రీ ఏకాదశీ-వ్రతకథా అను గ్రంధమున ప్రకాశింపబడినది)

శ్రీ గౌడీయ వేదాంత సమితి ద్వారా శ్రీ ఏకాదశీ-వ్రతకథా-నామముచే సప్తమ సంస్కరణ రూపంలో గ్రంధము ప్రకాశింపబడినది. ఈ గ్రంధమున విభిన్నమగు పురాణాలు ఇంకా వైష్ణవ-స్మృతిరాజు శ్రీ హరిభక్తివిలాసము ఇత్యాది గ్రంధములు సంయుక్తమైయున్నవి. శ్రీ గౌడీయ వేదాంత సమితి ద్వారా ప్రకాశింపబడిన "శ్రీ చైతన్య పంజికా" యొక్క ప్రవక్తకుడు నిత్య లీలా ప్రవిష్ట ఓం విష్ణు పాద అష్టోత్తరశత శ్రీ శ్రీ మద్ భక్తి ప్రజ్ఞాన కేశవ గోస్వామి మహారాజుల వారు స్వయంగా వ్రాసిన భూమికల యందు శ్రీ చైతన్య-పంజికా యొక్క ఆదర్శ-స్వరూపులు-జగద్గురువు శ్రీ ల భక్తి సిద్ధాంత సరస్వతి గోస్వామి ప్రభుపాదుల విచారధారతో యుక్తమైన "గౌడీయేర కృత్య" (భాగవత ధర్మము) శీర్షిక నుండి ఆయన స్వహస్తాలతో వ్రాయబడిన కొన్ని ఉపదేశాలు ముద్రింపబడినవి. అందులో సంఖ్యాపూర్వకముగా నామము గ్రహించుటతో పాటు ఏకాదశీ ఇత్యాది హరివాసర వ్రతం పాలన సంబంధమున విశేషంగా నిర్దేశింపబడినది. అరువది నాలుగు భక్తి అంగములలో కూడా ఏకాదశీ వ్రతపాలనను గూర్చి వ్రాయబడియున్నది. కాబట్టి భక్తియోగమున పురోభివృద్ధికై జనులందరి ద్వారా ఈ ఏకాదశీ వ్రతం లేక హరివ్రతాన్ని పాటించుట యొక్క నిత్యత్వాన్ని మరియు ఉపయోగాన్ని స్వీకరింపబడినది.

పురాణాదుల యందు చెప్పబడింది, సర్వ శ్రేష్ఠమైన ఏకాదశీ తిథి మనిషి మాత్రమునకు కోరిన కోర్కెలన్నిటిని ప్రధానము చేయునదైయున్నది. శుక్ల పక్షము మరియు కృష్ణ పక్షము రెండు పక్షముల యందు వచ్చు ఏకాదశీ రోజున శ్రవణము కీర్తనాది మహోత్సవములు చేయుట కర్తవ్యము. ఈ వ్రతాన్ని పాటించుటచే పాపాలన్నియు ధ్వంసమగును, సర్వఐశ్వర్యములు ప్రాప్తించును మరియు శ్రీ కృష్ణుని యందు ప్రేమ ఉత్పన్నమగును. భగవంతుని ప్రేమించడం, విధి విధానాలను పాటించడం, భోజనాన్ని నిషేధించడం, వ్రతాన్ని పాటించనిచో కలుగు దోషాలు మొదలగు నాలుగు కారణాలచే ఏకాదశీ వ్రతం యొక్క నిత్యత్వం ఋజువైనది. శ్రీ హరికి ఏకాదశీ వ్రతం అన్నిటికంటే ప్రియమైనది. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు,శూద్రులు, స్త్రీలు, పురుషులు మొదలగు ఎవరైనను భక్తిపూర్వకంగా ఏకాదశీ వ్రతాన్ని పాటిస్తారో వారు మోక్షాన్ని మరియు భగవంతుని సాన్నిధ్యాన్ని పొందగలరు. ప్రతి ఒక్కరూ ఏకాదశీ రోజున ఉపవాసం ఉండి వ్రత నియమాలను పాటించుట అత్యంత ఆవశ్యకమైయున్నది. ఉపవాసం యొక్క ఫలితాన్ని పొందగోరు వ్యక్తి ఏకాదశీ ముందు రోజు రాత్రి, తరువాత రోజు రాత్రి మరియు ఏకాదశీ రోజున భోజనాన్ని పరిత్యాగం చేయవలెను. ఏకాదశీ రోజున బ్రహ్మ-హత్యాది పాపాలన్నియు అన్నమందు ప్రవేశించును, కనుక ఆ రోజున ఐదు రకాల (బార్లీ, వరి, ఆవాలు, మినుములు, నువ్వుల నూనె ఇత్యాది) భోజనాలను చేయువాడు అన్నీ రకాల పాపాలను గ్రహించినట్లగాను, ఇంకను మాతృ హత్య, పితృ హత్య, భాతృ హత్య మరియు గురు హత్య మొదలగు పాపములన్నిటిని చేసినవానిగా గణింపబడును. బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు, మరియు సన్యాసులు మొదలగు వారు ఏకాదశీ రోజున భోజనం చేయుటచే గోమాంస భోజనం చేయడంతో సమానము. బ్రాహ్మణున్ని చంపినవానికి, మద్యపానం చేయువానికి, దొంగతనం చేయువానికి ఇత్యాది పాపములన్నిటిని నుండి ముక్తి పొందుటకు విధి విధానాలు చెప్పబడినవి, కాని ఏకాదశీ రోజున భోజనం చేయువానిని రక్షించుటకై ఎటువంటి ఉపాయం లేదు. ఏకాదశీ రోజున అన్నాన్ని గ్రహించు వ్యక్తి తన పితరుల సహితం నరకానికి వెళ్ళును. హరివాస తిథి రోజున ఎవరికైనా భోజనం చేయమని బ్రతిమాలడం కూడా అన్యాయమగును.

విధవ స్త్రీలు ఎవరైన ఏకాదశీ రోజున అన్నాన్ని గ్రహించినచో వారు చేసుకున్న పుణ్యమంతా నష్టమగును, ఇంకా అన్నీ వర్ణాశ్రమము వారు, విధవ, సతీ, సన్యాసి మొదలగు వారెవరైనను ఏకాదశీ రోజున అన్నాన్ని గ్రహించినచో "అంధతామిశ్ర" మను నామం గల నరకమున దుర్గతి పొందును. భక్తియుక్త పూర్వకంగా భార్య పిల్లలతో మరియు బంధుమిత్రులతో సహా ఇరుపక్షాల ఏకాదశీ రోజున ఉపవాసం ఉండుటచే భగవంతుని భక్తి మరియు పరమపదమును పొందవచ్చును. ఘోరమైన కష్టాలలో ఉన్నపుడు లేక జన్మము మరియు మరణమను అపవిత్ర అవస్థలో నైనను ఏకాదశీ వ్రతాన్ని త్యాగం చేయకూడదు. ఏకాదశీ రోజున నైమిత్తిక శ్రాద్ధము వచ్చినపుడు ఆ రోజు ఉపవాసం ఉండి ద్వాదశినాడు శ్రాద్ధం పెట్టవలెను. ఉపవాసం రోజున శ్రాద్ధం ఎటువంటి పరిస్థితులలోను పెట్టరాదు, ఎందుకంటే ఆ రోజు దేవతలు మరియు పితృగణాలు నిందిత-అన్నాన్ని స్వీకరించరు. ఏకాదశీ రోజున శ్రాద్ధం పెట్టడం వలన దాత, భోక్తా మరియు శరీరం వదిలిన ఆత్మ ముగ్గురికి కూడా నరకం వెళ్ళక తప్పదు. ఎనిమిది సంవత్సరాల వయస్సు నుండి యనబది సంవత్సరాల వయస్సు వరకు శుక్ల మరియు కృష్ణ పక్షము రెండు పక్షాల ఏకాదశీ రోజున ఉపవాసం ఉండుట స్త్రీలు, పురుషులు మరియు మనుషులందరి కర్తవ్యము. వైష్ణవులు, శైవలులు, స్మార్తులు ఇత్యాది మనుషులందరు ఏకాదశీ వ్రతాన్ని పాటించుట వారి యొక్క కర్తవ్యము. శివుడు పార్వతి దేవితో ఇలా అంటున్నారు, నా భక్తుడు నా భక్తి బలాన్ని ఆశ్రయించి ఏకాదశీ రోజున అన్నాది భోజనం చేయు దుష్టుడు నాకు అప్రియమైన వానిగా అర్థం చేసుకొనవలెను. భార్య భ ర్త ఇద్దరూ లేక భార్య భర్త యొక్క ఉద్దేశ్యమై ఏకాదశీ వ్రతాన్ని పాటించుటచే ఆవిడకి వందరెట్లు పుణ్యం లభిస్తుంది. పిల్లలు, వృద్ధులు, కష్టాలలో ఉన్నను, రోగి యైనను, అసమర్థ వ్యక్తైనను రాత్రి పూట ఒకసారి పాలు, పండ్లు తీసుకుని ఏకాదశీ వ్రతాన్ని పాటించవలెను.

శిశువులను రక్షించడానికి తల్లి వలె మరియు రోగులను స్వస్థత చేకూర్చుటకు ఔషదమువలె జీవులందరిని రక్షించుటకు ఏకాదశీ తిథి ఆవిర్భవించినది. వివిధ రకాల దుఃఖాలతో నిండియున్న ఈ సంసారంలో దుర్లభమైన మానవజన్మ పొందిన వారెవరైతే ఈ ఏకాదశీ వ్రతాన్ని పాటించెదరో వారు ధన్యులు, వారు బుద్ధివంతులు.

ఏకాదశీం పరిత్యజ్య యోఽన్యవ్రతముపాసతే|
స కరస్థం మహారత్నం త్యక్తా లోష్ట్రం హి యాచతే॥

(హరిభక్తివిలాసము)

ఏకాదశీ వ్రతం విడచి ఇతర వ్రతాలను పాటించుట అనగా చేతికి అందిన మణిని వదిలి మట్టిముద్దను ప్రార్థించుటతో సమానమని అర్థము.

సంసారసర్పదష్టానాం నరాణాం పాపకర్మణామ్।
ఏకాదశ్యుపవాసేన సద్య ఏవ సుఖం భవేత్॥

(హరిభక్తివిలాసము)

సంసారమను పాము ద్వారా కాటువేయబడిన పాపి జనులందరు ఏకాదశీ ఉపవాసం ద్వారా మాత్రమే పరమ సుఖాన్ని మరియు శాంతిని పొందగలరు.

ఏకాదశీ రోజున తినడానికి అన్నంలేక ఉపవాసం ఉండవలసి వచ్చినను లేక కారాగార మందు బంధింపబడినపుడు ఏకాదశీ రోజున ఉపవాసం ఉండవలసివచ్చినను ఏకాదశీ వ్రత ఫలితం లభించును. గోవిందుని స్మరణము, మరియు ఏకాదశీ ఉపవాసము ఈ రెండునూ నిస్సందేహంగా మానవునికి ప్రాయశ్చిత్తం లాంటివి మరియు ఈ సంసారము నుండి ఉద్ధరించునవి. ఎవరైతే అన్నీ సుఖాలకు, అన్నీ ధర్మాలకు, అన్నీ గుణాలకు ఆశ్రయుడైన జగత్పతియగు భగవంతునికి అత్యంత ప్రియమైనది మరియు అన్నీ ధర్మాలలో శ్రేష్ఠమైనది యగు ఏకాదశీ వ్రతాన్ని పాటించునో వారు వైకుంఠ లాభమును పొందెదరు. ఏకాదశీ-వ్రతకథా శ్రవణం చేయుటచే, వ్రతాన్ని పాటించుటచే, వ్రతాన్ని పాటించుటకు అనుమతించటంచే, లేక వ్రతాన్ని పాటించుటకై జనుల హృదయమున శ్రద్ధా ఉత్పన్నం చేయుటచే అన్నీ పాపాల నుండి ముక్తి యగును మరియు అతి ఉత్తమ గతి ప్రాప్తించును. హరివాసము తప్ప దానము, తపస్య, తీర్థ స్నానము, లేక ఇతర ఏ పుణ్యాలైనను ముక్తిని పొందుటకు కారణము కావు. ఏకాదశీ-వ్రతాన్ని శ్రద్ధగా పాటించు వ్యక్తి సర్వత్ర పూజింపబడును; వారు వ్యాధి, బాధ, అసూయ, అపరాధం మరియు పిరికితనం నుండి భయపడే అవకాశం లేదు; సర్వదా అతని హృదయమున శ్రీ హరి యొక్క స్మృతి నిశ్చలంగా ఉండును, నిత్యము హరి కథ యందు రుచి యుండును, మరియు నిత్య-ధర్మమందు మతి యుండును, ఇంకా శ్రీ కృష్ణుని యందు అతిశయమగు విశుద్ధ భక్తి ప్రాప్తించును. ఏకాదశీ స్వయంగా పుణ్య-స్వరూపిణీ, సర్వ పాపములను వినాశనము చేయునది, విష్ణు భక్తిని జాగృతము చేయునది, భగవత్సాక్షాత్కారమును ప్రధానము చేయునదైయున్నది. జగదీశ్వరుడగు భగవంతుడు స్వయంగా ఏకాదశీ యందు మూర్తీభవించి నివసించును. ఏదైతే విష్ణు శక్తిచే సమన్వితము చెందియున్నది, అనంత స్వరూపాలతో నిండియున్నది మరియు జగత్తంతయు వ్యాప్తించియున్నది, అదియే అన్నీ రకాల మంగళాలను ప్రధానము చేయు ఏకాదశీ తిథియై యున్నది.

అరుణోదయ-యుక్త ఏకాదశీని లేక దశమి-యుక్త ఏకాదశీని ఖచ్చితంగా త్యాగం చేసి శుద్ధ ఏకాదశీని పాటించుటయే అందరి కర్తవ్యము. ముల్లోకాల్లో గల పాపమంతటికి, దశమి-యుక్త ఏకాదశీ నివాస స్థానమని అందురు. రాక్షసులు మరియు అసురులు దశమియుక్త ఏకాదశీని ఆశ్రయిస్తారు, ద్వాదశి-యుక్త ఏకాదశీ రోజున ఉపవాసమున్న వ్యక్తి భగవంతుడు కోరిన ఫలాలను ప్రధానము చేయును. దశమి-యుక్తమగు ఏకాదశీని హరివాసముగా లెక్కింపబడదు. ఇక్కడ ద్వాదశినాడు ఉపవాసము ఉండవలెను, మరియు త్రయోదశీ రోజున పారణచేయుటయే కర్తవ్యము. జగద్గురువు శ్రీ ల భక్తి వినోద ఠాకూర్ల వారు ఇలా పాడారు.

"మాధవ-తిథి భక్తి జననీ, యతనే పాలన కరి।", అనగా విద్ధా ఏకాదశీని పరిత్యాగం చేసి శుద్ధ ఏకాదశీ ని పాటించమని ఉపదేశించితిరి. ఈ గ్రంధమునకు అంతిమమున విద్ధా ఏకాదశీ గురించి సంక్షిప్తంగా చెప్పబడియున్నది. ఏకాదశీ వివిధ రకాల నామాలచే వివరింపబడుచున్నది, ఇంకా అష్ట-మహాద్వాదశులు కూడా వేరే వేరే నామాలతో ప్రసిద్ధమైనవి. ఈ విషయాలన్నిటి గురించి ఈ గ్రంథమున సంపూర్ణ ఇతిహాసము మరియు వృత్తాంత సహితం విశ్లేషించడమైనది. ఈ గ్రంధము ఏకాదశీని పాటించువారి కొరకు తగినంత సహకారం చేయును, ఇందులో సందేహము లేదు. ఈ సంస్కరణము యొక్క అనుబంధము నందు "అష్టమహాద్వాదశుల" ను నిరూపించబడినవి, వ్రతాన్ని ఆచరించుటకు తెలిపెడి కీర్తనం, మాహాత్మ్యం ఇత్యాది మరియు గ్రంథము యొక్క పూర్వ నిబంధనము యందు అధికముగా జ్ఞాన మార్గమును గురించి చెప్పబడింది. వ్రతాన్ని పాటించువారు, పఠించువారు మరియు వినేవారందరు భగవంతుని భక్తి లాభము పొందుటచే మా అందరి సేవలు సార్థకమగును. ఇంకను ఒకవేళ అసావధానముచే కొన్ని తప్పులు ఉన్నచో పాఠకులు తమ మంచి గుణములచే సవరించుకొనగలరు, ఇదియే మా మనవి.

వ్రతాన్ని పాటించువారు, పఠించువాడు-పఠించునది ఇంకా శ్రవణం చేయు వారు ఈ గ్రంధ సహాయముచే భగవంతుని భక్తి లాభమును పొందుటచే మా అందరి సేవా ప్రయత్నము సార్థకమగును. అసావధానముచే కొన్ని తప్పులు వాటిల్లినచో పఠించువారు తమ సాత్విక స్వభావముచే సరిదిద్దుకొనగలరని ఆశిస్తున్నాము.

అనుకల్పం (ఏకాదశి రోజున తీసుకొనుటకు యోగ్యమైన ఆహార పదార్థాలు)

(1) అన్నీ రకాల పండ్లు (తాజా మరియు ఎండిన), ఎండిన పండ్లు మరియు వాటి వలన వచ్చిన నూనె, నీటితో కూడిన పండ్లు, సింగాడా, చెరకు గడి, పంచదార, చెరకుతో చేసిన ఇతర పదార్థాలు, పంచదారలో మనుష్యుల, ఆవు, పంది, మరియు కుక్కల ఎముకల చూర్ణ మిశ్రమము కలుపే ఆస్కారమున్న కారణముచే శుద్ధమైన బెల్లం (మైదా రహితమైన) ను వాడడం మంచిది.

(2) బంగాళాదుంపలు, చిలగడదుంప, గుమ్మడి కాయ, కాడలు, దోసకాయ, ముల్లంగి, పనసకాయ, నిమ్మకాయ, అవకాడో (మెక్సికోలో జన్మిచ్చే ఒక రకమైన పండ్లు) ఆలివ్ నూనె, కొబ్బరి, కుట్టూ పొడి, అన్నీ రకాల కలకండా.

(3) పాలు మరియు పాల పదార్థాలు, అన్నీ రకాల దేశీయ పాలు మరియు వాటి ఉత్పాదన. చాతుర్మాసము రెండవ నెలలో పెరుగును మరియు మూడవ నెలలో పాలను త్యాగం చేయవలెను.

(4) భారతీయ దేశీ ఆవుల వెన్నను ఒక మోతాదు మంటలతో వేడిచేయగా తయారైన శుద్ధ నెయ్యి, వేరుశనగ నూనె, కొబ్బరి నూనె, బాదం పప్పు నూనె.

ఏకాదశి రోజున ఉపయోగించడానికి యోగ్యమైన మసాలాలు

మిరియాలు, తాజా అల్లం, శుద్ధమైన సైంధవ లవణం (సముద్రపు ఉప్పు ఏకాదశి రోజున ఉపయోగించకూడదు) మరియు తాజా

పసుపు (ఎండిన పసుపు కొమ్ములను ఇంట్లోనే చూర్ణము చేసినది, మైదా రహితముగా తయారైనది) ఇవన్నియు స్వచ్ఛముగా మరియు శుభ్రముగా యుండవలెను.

ఏకాదశి రోజున నిషేధించిన ఆహార పదార్థాలు–

(1) టమోటా, వంకాయ, కాలీఫ్లవర్, సిమ్లా మిర్చి, బఠానీలు, పచ్చి శనగలు, అన్నీ రకాల సేమియాలు, రాజమా ఇత్యాది మరియు వాటితో చేసిన పదార్థాలు అనగా పకోడి, సోయాబీన్స్ తో చేసిన పెరుగు, పాలు మొదలగునవి.

(2) కాకరకాయ, సొరకాయ, పొట్లకాయ, బీన్స్, కొమ్మ, బెండకాయ, అరటికాయ పువ్వులు.

(3) అన్నీ రకాల ఆకు కూరలు– పాల కూర, సాలెడ్, క్యాబేజీ, కరివేపాకు, వేపాకు ఇత్యాది.

(4) ధాన్యాల తో చేసిన చూర్ణము– మిల్లెట్, బార్లీ, రవ్వ, గోధుమల నూక, బియ్యం, శ్యామా బియ్యం, మొక్కజొన్న, మరియు అన్నీ రకాల పిండి పదార్థాలు అనగా బియ్యం పిండి, శనగ పిండి, మినుమల పిండి ఇత్యాది.

(5) ధాన్యాల తో చేసిన నూనె– మొక్కజొన్న నూనె, ఆవాల నూనె, నువ్వుల నూనె, సోయా బీన్స్ నూనె, వనస్పతి నూనె ఇత్యాది మరియు ఈ నూనెలలో వేంచిన పదార్థాలు అనగా వేరుసెనగ పప్పు, జీడి పప్పు, బంగాళాదుంపల చిప్స్, మరియు ఇతర వివిధ రకాల అల్పాహారాలు.

(6) మొక్కజొన్న లేక రాగుల జావ, మరియు వాటితో తయారైన పదార్థాలు ఉదాహరణకు బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, కస్టర్డ్ పౌడర్, కస్టర్డ్ కేకులు, హల్వా, క్రిములు, మిఠాయిలు, సబ్బియ్యం ఇత్యాది.

(7) తేనె.

ఏకాదశి రోజున వాడకూడని మసాలాలు

హింగువ, నువ్వులు, జీలకర్ర, మెంతులు, ఆవాలు, చింతకాయ, సోంపు, యాలుక్కాయలు, కలోంజి (నల్ల జిలకర), జాజికాయ, గసగసాలు, సెలెరీ (వాము), లవంగాలు, ఇత్యాది.

ఏకాదశిని ఏ విధంగా పాటించవలెను?

మాంసాహారం, చేపలు, గుడ్లు, ఉల్లిపాయ, వెల్లుల్లి, కారెట్, ఎర్రపు పప్పు, కందిపప్పు (Green Flat Lentils), పుట్ట గొడుగులు మరియు వీటితో చేసిన పదార్థాలను ఎటువంటి పరిస్థితులలో అయినను తినకూడదు. ఏకాదశి రోజున టీ, కాఫీ, ఆకు వక్కలు, గుట్కా, ఖైనీ, బీడీలు, సిగరెట్లు, పొగాకు తో తయారైన పదార్థాలు, సుపారీ, సారాయి మొదలగు వాటినన్నిటినీ త్యజింపవలెను. ఏకాదశి రోజున స్త్రీ తో సంగమించుటచే క్షయరోగం (Tuberculosis T.B.) వ్యాపించును.

కూర్మావతారం

విష్ణు భగవంతుని పది అవతారములలో కూర్మావతారం రెండవదై యున్నది. కూర్మావతారపు కథ ఇలా యున్నది. బ్రహ్మా తన సృష్టి క్రమములో భృగువు, మరీచుడు, అత్రి, కర్దముడు, పులస్త్యుడు, పులహ, అంగిర మరియు క్రతువు మొదలగు తొమ్మిది మంది ప్రజాపతులను ఉత్పన్నం చేశను. అత్రి మహర్షి యొక్క పుత్రుడు దుర్వాసుడు గొప్ప తేజస్సు గల మునియై యున్నాడు. ఆయన గొప్ప తేజస్సుతో పాటు అత్యంత క్రోధము గల వాడు మరియు సంపూర్ణ లోకాలకు కష్టాలను కలిగించువాడై యున్నాడు.

ఒకసారి దుర్వాసుడు దేవతలకు రాజగు ఇంద్రుడ్ని కలవడానికి స్వర్గలోకానికి వెళ్ళెను.ఆ సమయమున ఇంద్రుడు ఏనుగు మీద కూర్చొని దేవతలందరిచే పూజింపబడి ఎక్కడికో వెళ్లడానికి ఆత్రుతగా ఉండెను. ఇంద్రుడ్ని చూసి మహాతపస్వి యగు దుర్వాసుని మనసు ప్రసన్నత చెందినది. దుర్వాసుడు వినయపూర్వకంగా ఇంద్రునికి ఒక పారిజాత పుష్పమాలను బహూకరించెను. ఇంద్రుడు దానిని తీసుకుని ఏనుగు తల పైన వేశను మరియు తాను నందనవనమునకు బయలుదేరెను. ఏనుగు మదముతో ఉన్మత్తమై పోయినది. అది తన తొండముతో ఆ పుష్ప మాలను తీసివేశను మరియు నలుపుతూ తెంచి భూమి పైన విసిరి పారేసినది.

దీనిచే దుర్వాసునికి కోపం వచ్చినది మరియు ఇంద్రుడికి శాపం ఇస్తూ ఇలా అనెను. ఓ దేవరాజా! నువ్వు ముల్లోకాల రాజ్యలక్ష్మీ చే సంపన్నుడవగు కారణముచే నన్ను అవమానించితివి. కనుక నీ ముల్లోకాల సంపదంతయు నష్టమగుగాక. ఇందులో కొద్దిగైనను సందేహం వద్దు. దుర్వాసుడు ఈ విధంగా శాపిమిచ్చిన తరువాత ఇంద్రుడు తిరిగి తన నగరానికి వెళ్ళి పోయను. దుర్వాసుని శాపముచే లక్ష్మీదేవి అంతర్ధానమైయ్యను. బ్రహ్మ ఆది దేవతలు, గంధర్వులు, యక్షులు, కిన్నెరలు, దుత్యులు, దానవులు, నాగులు, మనుష్యులు, రాక్షసులు, పశు-పక్షులు మరియు కీటకాలు ఆది జగత్తు యొక్క చరాచర ప్రాణులన్నియు దరిద్రత కారణముచే దుఃఖాన్ని భోగింపసాగిరి.

జనులందరు ఆకలి దప్పికలతో పీడితులై బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ఇలా అన్నారు.

ఓ భగవంతుడా! ముల్లోకాలు ఆకలి దప్పికలతో పీడింపబడుచున్నారు. మీరు జనులందరికి స్వామి మరియు రక్షకులు. మేము మీ శరణానికి వచ్చితిమి. కనుక మీరు మమ్మల్ని రక్షించండి.

బ్రహ్మ వారి మాటలను విని ఇలా అన్నారు– దేవతలారా, దైత్యులారా, గంధర్వులారా మరియు మనుష్యులారా ఇత్యాది ప్రాణులారా! నా మాట వినండి. ఇంద్రుడి అనాచారం వలనే ఈ ఆపదలన్నీ ఉపస్థితమైనవి. దుర్వాసుని క్రోధము వలన ఈ రోజు ముల్లోకాలు నశిస్తున్నాయి. ఎవరి కృపాకటాక్షములచే లోకములన్ని సుఖమును పొందెదరో, ఆ జగన్మాత మహాలక్ష్మి అంతర్ధానమైయ్యను. కాబట్టి మనమందరం క్షీరసాగరమున విరాజితుడగు సనాతన దేవుడు మరియు భగవంతుడగు నారాయణుని ఆరాధిద్దాము. ఆయన ప్రసన్నుడగుటచే మాత్రమే సంపూర్ణ జగత్తునకు కళ్యాణం చేకూరును. ఈ విధంగా నిశ్చయించుకొనిన బ్రహ్మ, సంపూర్ణ దేవతలు మరియు భృగు ఆది మహర్షులతో కలసి క్షీరసాగరమునకు వెళ్ళి విధిపూర్వకంగా పురుష సూక్తుల ద్వారా భగవంతుని ఆరాధింపసాగిరి. దీనిచే ప్రసన్నుడైన భగవంతుడు దేవతలందరికి దర్శనమిచ్చెను. అప్పుడు భగవంతుడు ఇలా అన్నారు– దేవతలారా! అత్రి కుమారుడగు దుర్వాసుని శాపంచేత భగవతీ లక్ష్మీదేవి అంతర్ధానమైయ్యను. కనుక మీరు మందరాచల పర్వతాన్ని నిర్మూలించి క్షీరసాగరమున ఉంచండి మరియు దానిని కవ్వంగా చేసుకొని నాగరాజగు వాసుకిని త్రాడుగా ఆ కవ్వం చుట్టూ చుట్టండి. ఆ తరువాత దైత్యులతో, గంధర్వులతో మరియు దానవులతో కలసి సముద్రాన్ని చిలకండి. దీని వలన జగత్తుని రక్షించుటకై లక్ష్మీదేవి ప్రకటితమగును. ఆవిడ కృపా దృష్టి

పడడముతో మీరందరూ గొప్ప సౌభాగ్య వంతులు కాగలరు. నేనే స్వయంగా కూర్మ రూపమును ధరించి మందరాచల పర్వతాన్ని నా వీపు మీద ధరించెదను. ఇంకను నేనే దేవతలందరిలో ప్రవేశించి నా శక్తిచే వారిని బలవంతులుగా తయారు చేశదను. ఈ విధంగా పలికి భగవంతుడు అంతర్ధానమైయ్యను.

ఆ తరువాత దేవతలందరు మరియు మహాబలియగు దానవులు ఆది మందరాచలమును నిర్మలించి క్షీరసాగరమున స్థాపించితిరి. అదే సమయమున అమితమైన పరాక్రమవంతుడగు నారాయణ భగవంతుడు తాబేలు రూపమున ప్రకటితమైఆ పర్వతాన్ని తన వీపు మీద ధరించెను మరియు సర్వమున వ్యాపించి యున్నవాడు, శాశ్వత ప్రభువు ఒక్క చేతితో దాని శిఖరాన్ని పట్టుకొని యుండెను. ఆ తరువాత దేవతలు మరియు అసురులు మందరాచల పర్వతానికి చుట్టూ నాగరాజు వాసుకీని చుట్టి క్షీరసాగరమును చిలకసాగిరి.

ఏ సమయమున మహా బలవంతులగు దేవతలు లక్ష్మీదేవిని ప్రకటింప జేయుటకు క్షీరసాగరమును చిలుకుచుండిరో, ఆ సమయమున మహర్షులందరూ ఉపవాసం చేసి మనస్సుని ఇంద్రియములను నియంత్రించి శ్రీసూక్తం మరియు విష్ణు సహస్ర నామములను పఠింపసాగిరి. శుద్ధ ఏకాదశి రోజున సముద్ర మంథనం ఆరంభమైనది. ఆ సమయమున లక్ష్మీదేవి ప్రకటితమగునను అభిలాషముతో బ్రాహ్మణ శ్రేష్ఠులు మరియు మునులు లక్ష్మీ నారాయణ భగవంతుడ్ని ధ్యానించిరి మరియు పూజించిరి.

ఆ సమయమున మొట్టమొదటి గా కాలకూటమను నామము గల మహా భయంకరమగు విషం ప్రకటితమైనది, అది చాలా పెద్ద పిండం రూపంలో ఉన్నది. అది ప్రలయకాలంలోని అగ్ని వలె అత్యంత భయంకరమైనదిగా తెలియబడుచున్నది. ఆ విషాన్ని చూసిన వెంటనే దేవత లు మరియు దానవులందరు భయముతో పారిపోయిరి. శ్రీ శంకరుడు తన హృదయములో సర్వ దుఃఖాలను హరించే నారాయణ భగవంతుడ్ని ధ్యానించెను మరియు మూడు నామములతో కూడిన మహామంత్రాన్ని భక్తి పూర్వకంగా జపిస్తూ భయంకరమగు విషాన్ని త్రాగెను. అచ్యుతా, అనంతా మరియు గోవిందా ఇవి యే శ్రీ హరి యొక్క మూడు నామములు. ఓం అచ్యుతాయ నమః, ఓం అనంతాయ నమః మరియు ఓం గోవిందాయ నమః మొదలగు ఈ మూడు నామములను ఏకాగ్రతతో ఎవరైతే జపించెదరో, వారికి కాలముతో మరియు మృత్యువు వలన భయం కలుగదు.

ఆ తరువాత సముద్ర మంథనం చేయుటచే లక్ష్మీదేవి యొక్క పెద్ద అక్క దరిద్రా దేవి ప్రకటితమైనది. ఆవిడ దేవతలను తన నివాసమును ఆజ్ఞాపించమని అడిగినది.అప్పుడు దేవతలు ఇలా అన్నారు- ఎవరి ఇంట్లో ప్రతి రోజూ కలిహించుకొనెదరో అదియే మేము నీకు ఉండడానికి స్థానముగా ఇస్తున్నాము. నువ్వు అమంగళాన్ని కూడా తీసుకొని వారి ఇండ్లలో నివసించుము. ఎవరైతే ఎల్లప్పుడూ అబద్ధాలు పలుకుతారో, ఎక్కడైతే కఠోరమైన పదజాలం ప్రయోగించెదరో, వారి వారి ఇండ్లకు దుఃఖాన్ని మరియు దరిద్రతను ప్రధానం చేస్తూ నువ్వు నిత్యం నివసించుము. దరాద్రా దేవి కి ఈ విధంగా ఆదేశించి పునః దేవతలు క్షీరసాగరమును మథించిరి. అప్పుడు అందమైన కళ్ళు కలిగిన వారుణీ దేవి ప్రకటితమైనది, ఆవిడని నాగరాజగు అనంతుడు గ్రహించాడు. ఆ తరువాత శుభలక్షణాలన్నిటితో సుశోభితమైన మరియు అన్నీ రకాల ఆభూషణాలతో విభూషితమైన ఒక అందమైన స్త్రీ ప్రకటితమైనది, ఆవిడనే గరుడుడు తన భార్యగా స్వీకరించెను. ఆ తరువాత దివ్యమైన అప్సరసలు మరియు గొప్ప తేజస్సు గల గంధర్వులు ఉత్పన్నులైయ్యిరి, వారు అత్యంత రూప వంతులు మరియు సూర్య చంద్రుల వలె తేజస్సు గలవారు. ఆ తరువాత ఐరావతమను ఏనుగు, ఉచ్చైఃశ్రవా అను అశ్వం, ధన్వంతరి యగు వైద్యుడు, పారిజాత వృక్షం మరియు సంపూర్ణ కోరికలను తీర్చే సురభి గోవు ఆవిర్భవించింది. వీటన్నిటినీ ఇంద్రుడు ఎంతో ఆనందముతో గ్రహించెను.

ద్వాదశి ప్రాతః కాలమున మహాలక్ష్మి ప్రకటితమైనది. ఆవిడని చూచి దేవతలకు అమితమైన సంతోషం కలిగినది. ఆ తరువాత క్షీరసాగరము నుండి శీతలము మరియు అమృతమయమైన కిరణాలతో యుక్తమగు చంద్రుడు ప్రకటితమైనాడు, ఈయన లక్ష్మీదేవికి తమ్ముడు. ఆ తరువాత శ్రీ హరికి పత్నియగు తులసీ దేవి ప్రకటితమైనది. జగన్మాతయగు తులసీ శ్రీ హరి యొక్క పూజ కొరకు ప్రకటితమైనది. ఆ తరువాత దేవతలందరూ ప్రసన్న హృదయముతో మందరాచల పర్వతాన్ని యథాస్థానంలో స్థాపించిరి మరియు అందరూ కలసి లక్ష్మీదేవిని స్తుతించిరి. అప్పుడు లక్ష్మీదేవి సంతోషించి ఇలా అనెను– నా నుండి మీ మనసుకి నచ్చిన వరాలు అడగండి.

దేవతలు ఇలా అన్నారు– విష్ణువుని ప్రియతమయగు ఓ లక్ష్మీదేవి! మీరు మా యందు ప్రసన్నులై శ్రీ విష్ణువు యొక్క వక్షస్థలమున నివసించవలెను. ఎప్పటికీ భగవంతుని నుండి వేరుగాకుండా మరియు ముల్లోకాలను ఎప్పటికీ పరిత్యాగం చేయవద్దు. అప్పుడు బ్రహ్మ మరియు నారాయణుడు ప్రకటితమైయ్యిరి. దేవతలందరు చేతులు జోడించి భగవంతున్ని ప్రార్థించిరి. ఓ స్వామి! జగత్తుని రక్షించుటకు మహారాణి లక్ష్మీదేవిని గ్రహించండి. ఇలా ప్రార్థించి బ్రహ్మ ఆది దేవతలందరూ విష్ణు భగవానుడిని మరియు లక్ష్మీదేవిని దివ్యమైన సింహాసనంపై కూర్చొన బెట్టి వారిద్దరిని పూజించిరి. క్షీరసాగరము నుండి కోమలమైన పత్రములతో ప్రకటితమైన తులసి దేవి ద్వారా దేవతలు నారాయణ భగవంతుడి యగళ చరణములను అర్చించిరి. దీనిచే సర్వేశ్వరుడగు శ్రీ హరి భగవంతుడు లక్ష్మీదేవి సహితం ప్రసన్నులై దేవతలకు వారి కోరిన వరాలను ఇచ్చెను. అప్పటి నుండి దేవతలు మరిఅయు మనుష్యులు ఇత్యాది ప్రాణులన్నియు చాలా ప్రసన్నత నొందిరి. వారికి ధన-ధాన్యాలు ప్రచుర పరిమాణంలో వృద్ధి నొందినది మరియు రోగముక్తులై అత్యంత సుఖమును అనుభవింపసాగిరి.

లక్ష్మీదేవి సహితం విష్ణు భగవంతుడు ప్రసన్నుడై సంపూర్ణ లోకముల హితము కొరకై మహామునులతో మరియు దేవతలతో ఇలా అనెను ఏకాదశి తిథి పరమ పుణ్యవంతమైనది. ఈ వ్రతం ఉపద్రవాలన్నిటిని శాంత పరుచునదై యున్నది. మీరందరూ లక్ష్మీదేవి ని దర్శించుటకై ఈ తిథి రోజున ఉపవాసం చేసితిరి, కాబట్టి ఈ ద్వాదశి తిథి నాకు ఎల్లప్పుడూ ప్రియమగును. ఈ రోజు నుండి ఎవరైతే ఏకాదశి రోజున ఉపవాసం ఉండి ద్వాదశినాడు ప్రాతఃకాలమున సూర్యోదయం అయిన తరువాత అధకమగు శ్రద్ధతో లక్ష్మీదేవి మరియు తులసీ దేవితో కలసి నన్ను పూజించెదరో, వారు అన్నీ బంధముల నుండి ముక్తిని పొంది నా పరమ పదమును పొదెదరు.

ఈ విధంగా చెప్పి విష్ణు భగవంతుడు మునుల ద్వారా తన స్తుతిని వింటూ లక్ష్మీదేవికి నివాస స్థానమగు క్షీరసాగరమునకు వెళ్ళిపోయను. అక్కడ శేషనాగు శయ్యమీద లక్ష్మీదేవి తో కలసి నివసించుచుండెను. ఆ తరువాత దేవతలు తాబేలు రూపం ధరించిన సనాతన భగవంతుడ్ని భక్తి పూర్వకంగా పూజించి ప్రసన్న చిత్తులయ్యిరి.

భగవంతుని ఆదేశముగా భావించి బ్రహ్మ ఆది దేవతలు , సిద్ధులు , మనుష్యులు, యోగులు మరియు మునులు ఇత్యాదులందరు గొప్ప భక్తి తో ఏకాదశి తిథిన ఉపవాసం మరియు ద్వాదశి తిథి రోజున భగవంతుని పూజించుటను ఆరంభించిరి.